సంపుటి :02 సంచిక :222 పేజీలు :07 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 30 , అక్టోబర్ 2025



వరద నుంచి వృద్ధురాలిని బయటకు తీసుకొస్తున్న రిస్క్యూ టీం



# అధైర్యపడొద్దు..

- వరద బాధితులకు అండగా ప్రభుత్వం
- మంత్రి కొండా సురేఖ
- వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటన
- డ్రోన్ ద్వారా ఆహార పంపిణీ పరిశీలన

02



వృద్ధుడిని మంచంపై తీసుకొస్తున్న రిస్క్యూ టీం, పోలీసులు

# వాన వెలిసింది.. వ్యథ మిగిలింది!

## ఉమ్మడి జిల్లాను వణికించిన `మొంథా` తుఫాన్

మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని కొన్ని ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వరంగల్ - హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ ఇంకా వర్షపు నీటితోనే నిండిపోయి ఉన్నది. భద్రకాళి రోడ్డు వద్ద ఉన్న సరస్వతీ కాలనీ, వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డు నీట మునిగిపోయాయి. పట్టణంలోని సుమారు 40కిపైగా కాలనీలు వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. సాయిగణేశ్ కాలనీ, సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్యనగర్, సమ్మయ్య నగర్‌లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది .

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



- ట్రైసిటీస్ అతలాకుతలం.. స్తంభించిన జనజీవనం
- కాలనీల్లో ఇప్పటికీ వరదనీరు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- వేలాది ఎకరాల్లో పంట నష్టం
- రేపు సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే


05

# ఊహించని విపత్తు



- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

06



# హైడ్రా తరహాలో వైడ్రా!

06

- ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- సీఎం రేపటి ఏరియల్ సర్వే తర్వాత ప్రకటించే అవకాశం
- ఒకవేళ ప్రకటన వస్తే ట్రైసిటీ వాసులకు మంచిరోజులు
- వరద ముప్పు నుంచి విముక్తి.. చెరువులు, నాళాల కబ్జాకు చెక్

# బతికుండగానే మార్చురీకి

- ఆధార్ కార్డులేదని రోగికి చికిత్స నిరాకరణ
- అచేతనంతో పడి ఉండటంతో మార్చురీకి రిఫర్
- పారిశుధ్య సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం
- మానుకోట ప్రభుత్వ దవాఖాన సిబ్బంది నిర్వాకం

05

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్ నగరంలో నీట మునిగిన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో గృహ నిర్బంధమైన ప్రజల వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలన్నారు. పోలీస్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే స్పందించాలని ఆయన కోరారు.









# అధైర్యపడొద్దు

- వరద బాధితులకు అండగా ప్రభుత్వం ఉంది
- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటన
- డ్రోన్ ద్వారా ఆహార పంపిణీ పరిశీలన
- జిల్లాలో నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందన్న కలెక్టర్

అక్షరదర్బార్, వరంగల్: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, అధైర్య పడవద్దని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి జల మయమైన వరంగల్ లోని ఎన్ఎన్ నగర్, బీఆర్ నగర్ ప్రాంతాల్లో మంత్రి లోక్ సభ సభ్యురాలు డా కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డా సత్య శారదతో కలిసి క్షేత్రస్థాయిలో వరద ప్రాంతాలను సందర్శించి, బాధితులకు ధైర్యం కలిగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయని, ఎస్ డీఆర్ ఎఫ్, డీఆర్ ఎఫ్ ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నామని అన్నారు. గత ఐదేళ్ల నుంచి ముంపు పరిస్థితి  తలెత్తుతున్నదని, నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు ఉండడం, కొన్ని ప్రాంతాలు కబ్జాకు గురి కావడం, సరైన వెడల్పుతో నాలాలు ఉండకపోవడం ఇందుకు కారణమని, ఇకముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారి ఆదేశం మేరకు ముందుకు వెళతామని మంత్రి తెలిపారు.

వరద ప్రభావం దృష్ట్యా  గత రాత్రి నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడానికి మన వద్ద అందుబాటులో ఉన్న డీఆర్ ఎఫ్ బృందాలకు తోడు ఎన్ డీఆర్ ఎఫ్ బృందాలను కూడా పిలిపించడం జరిగిందని, ఆయా డివిజన్ లకు చెందిన కార్పొరేటర్లు కూడా రాత్రి నుంచి వారి డివిజన్లలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, కాలనీల్లోని వరద ప్రాంతాల్లో చిక్కున్న వారిని పడవల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆవాసం అందిస్తున్నామని అన్నారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని, వరద వల్ల నిరాశ్రయులైన వారికి తాత్కాలికంగా వరంగల్ ప్రాంతంలో 9 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు 700 మందిని  తరలించినట్లు, వరద నీటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేని వారికి డ్రోన్ ల ద్వారా ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సారి వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లను అందించి ఆ ప్రాంతాలను ఖాళీ చేయించేలా చూస్తామని, ప్రస్తుత పరిస్థితి  నేపథ్యంలో రెండు రోజులు సెలవులు ప్రకటించామని, ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, వరంగల్ లో వరద పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకెళ్తానని, పునరావస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు  పౌష్టికాహారం, మంచినీటితో పాటు దుప్పట్లను కూడా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలో సగటున 25 సెం.మీ వర్షపాతం నమోదు కావడం జరిగిందని, పర్వతగిరి, కల్లెడ ప్రాంతాల్లో 37 సెం.మీ వర్షపాతం నమోదైందని, నెక్కొండలో 33 సెం.మీ వర్షం కురిసిందని, పర్వతగిరి, నెక్కొండ, వర్ధన్నపేట, రాయపర్తి  మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసిందని, పర్వతగిరిలో కొన్ని చెరువులకు గండ్లు పడ్డాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయని, ఎన్పీడీసీఎల్ నుండి సీఎండి పర్యవేక్షించి తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాయపర్తి మండలంలో కట్ట తెగడం వల్ల సుమారు 50 ఇండ్లు ప్రభావితం అయ్యాయని, పంట పొలాల్లోకి నీరు చేరడం జరిగిందని వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. వర్షం నిలిచిపోయినప్పటికి నగరంలో కొన్ని కాలనీలు ఇంకా నీటిలోనే ఉన్నాయని, ముంపును అరికట్టగలిగితే రాబోయే 12 నుండి 16 గంటలలో నీరు పూర్తిగా వెళ్ళిపోయే అవకాశం ఉంటుందని, ఎస్ఆర్ నగర్ లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడు వృద్ధాప్య కారణంతో మృతి చెందినట్లు తెలిసిందని, సమగ్ర సమాచారం అందాల్సి ఉందని తెలిపారు. వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏలాంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్య రాణి, కార్పొరేటర్ పల్లం పద్మ రవి, డీపీఓ అనురాధ, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.















# నవీన్ యాదవ్ ను గెలిపించండి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, హైదరాబాద్/జూబ్లీహిల్స్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధి 94వ డివిజన్ షేక్ పేటలోని 35, 36, 37, 38 పోలింగ్ బూత్(హజీజ్ బాగ్, అరవింద్ నగర్ కాలనీ)లలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు, భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడు ముందు వరుసలోనే ఉంటుందన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల వారిని సమానంగా చూసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ప్రజలకు మంచి పనులు చేసి ఓట్లు అడుగుతున్నామని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. బడుగు, బలహీన వర్గానికి చెందిన సోదరుడు నవీన్ యాదవ్ కు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే, అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా చేస్తాడని ఎమ్మెల్యే అన్నారు.





# అధైర్య పడకండి.. ఆదుకుంటాం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన





అక్షర దర్బార్, నర్సంపేట/నెక్కొండ : మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం నెక్కొండ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అదే విధంగా పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు పర్వతగిరి మాజీ జడ్పీటీసీ సింగులాల్ తహసీల్దార్ వేముల రాజ్ కుమార్ ఎంపీడీఓ యాసం లావణ్య, ఏఈవోలు, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్న కేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు సాయికృష్ణ నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివ రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి దుడిమెట్ల కొమురయ్య రమేష్ యూత్ కాంగ్రెస్ మండలఅధ్యక్షులు సింగం ప్రశాంత్ చల్లా పాపిరెడ్డి మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్ షైక్ యాకుబ్ పాషా గుంటుపల్లి ప్రభాకర్ రావు ఎదునూరి ప్రభాకర్ దుడిమెట్ల రాజు రావుల రాజు సూర్య పాల్గొన్నారు.

# విజన్ ఉన్న నాయకుడు పూర్ణాచారి

## ప్రజల మనసులు గెలుచుకున్న సేవా దృక్పథం



అక్షర దర్బార్, పరకాల: ప్రతి సంవత్సరం చెదురుమదురు వర్షాలకే నీట మునిగిపోయే స్థితి నుండి బయటపడిన 9వ వార్డు ప్రజలు, తమ మాజీ కౌన్సిలర్ పూర్ణ చారి పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. చిన్న వర్షానికి కూడా నీరు ఇళ్లలోకి చేరి నిత్యజీవితంలో ఇబ్బందులు పడిన కాలనీలో, పూర్ణ చారి నాయకత్వం వహించిన కాలంలో మాత్రం సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయి. ప్రజల సమస్యలను తనవిగా భావించి, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మెరుగుపరిచిన పూర్ణ చారి, అప్పటి ఎమ్మెల్యేతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించి, కాలనీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారు. వార్డులో నివసించే ప్రజలు ఆయనను "ముందు చూపు ఉన్న విజనరీ నాయకుడు"గా అభివర్ణిస్తూ, "ఆయన చూపించిన దారిలో మా కాలనీ అభివృద్ధి చెందింది. నేడు వర్షం పడ్డా ఒక చుక్క నీరు కూడా నిలవడం లేదు" అని ఆనందంగా తెలిపారు. ప్రజల అభిప్రాయాలు పూర్ణ చారి సేవా మనసును ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న అలాంటి నాయకుడు మాకు దొరకడం మా అదృష్టమని వార్డు ప్రజలు గర్వంగా చెబుతున్నారు.

# గంట కళావతి పరమర్శ



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన సూరలక్ష్మి బుధవారం మృతి చెందారు. కాగా గురువారం బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి విషయం తెలుసుకుని లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రాజీయే రాజమార్గం

- నవంబర్ 15న స్పెషల్ లోక్ అదాలత్
- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ పంచాక్షరి



అక్షర దర్బార్ ,మొగుళ్లపల్లి : రాజీయే రాజమార్గమని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి చిలకమారి పంచాక్షరి తెలిపారు. సెప్టెంబర్ 15 నవ తేదీన జరిగే స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 15న స్పెషల్ లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసుల్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జ్యుడీషియల్ డిపార్ట్ మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో ఉన్న తెలంగాణ న్యాయ సేవాధికారిక సంస్థను కలిసి ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

# రైతులకు పంట నష్టం చెల్లించాలి

## బిజెపి మండల అధ్యక్షుడు రాజ్ కుమార్



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలంలోని అన్ని గ్రామాలలో మొంథా తుఫాన్ ఎఫెక్ట్ తో ఎడతెరిపిలేని భారీ వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరిగిందని బిజెపి పరకాల మండల పార్టీ అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను అంచనా వేసి ప్రభుత్వం రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వీళ్లు మారరు.. వసూళ్లు ఆపరు



- కొనసాగుతున్న వసూళ్ల పరంపర
- డబ్బులు ఇస్తేనే లోడింగ్
- వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేయాలి
- స్పందించని అధికారులు

అక్షరదర్బార్, మంగపేట: మండలంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల్లో లారీ డ్రైవర్ల వద్ద వసూళ్ల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇసుక నింపుకోవడానికి వచ్చిన లారీ డ్రైవర్లను ముక్కుపిండి మరి (వసూల్ రాజాలు) వసూళ్లు చేస్తున్నారని లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు తూకం కాంటల వద్ద పార్కింగ్, ఇసుక లేవలింగ్, సీరియల్ అంటూ ఒక్కొక్క దానికి ఒక్కొక్క రేటును నిర్ధారించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక లారీలో ఇసుక లోడు చేయాలంటే 2వేల నుండి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తూ సంచులను నింపుకుంటున్నారని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం ఇసుక సరఫరా విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా నియంత్రించాలని పకడ్బందీ చర్యలతో ముందుకు సాగుతుంటే అందుకు విరుద్ధంగా మంగపేట మండలంలో ఇసుక రిచ్ కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. లారీ డ్రైవర్ల వద్ద నుండి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని ఎన్నిసార్లు పిర్యాదులు వసున్న ఇసుక రిచ్ కాంట్రాక్టర్లపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా టీజీఎండిసి మైనింగ్ శాఖ రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి వసూల్ రాజాలా వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేయాలని లారీ యజమానులు వేడుకుంటున్నారు.



## మొంథా తుఫాను బాధితులను ఆదుకోవాలి

**: సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు మల్లేశం**

అక్షరదర్బార్, నర్సంపేట: మోంతా తుఫాన్ కారణంగా వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మోడేమ్ మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట ఆర్డీఓకి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ, తుఫాన్ వర్షాల కారణంగా రైతులు శ్రమించి పండించిన పంటలు నీటమునిగాయని, రోడ్లు, చెరువులు, కాలువలు ధ్వంసమయ్యాయని తెలిపారు. రైతులకు పత్తి ఎకరాకు రూ.1 లక్ష, వరి ఎకరాకు రూ.60 వేల, మొక్కజొన్న ఎకరాకు రూ.80 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బోర్ర ఆనంద్, కార్యదర్శి ఈర్ల పైడి, నాయకులు భూమా అశోక్, బర్ల గౌరయ్య, ఈర్ల అనిల్ కుమార్, మానగాని సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు అండగా ఎమ్మెల్యే రేవూరి

**పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్**

అక్షర దర్బార్, పరకాల: మొంథా తుఫాను ప్రభావం వలన తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మన పరకాల పట్టణంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ సి సెల్ ఉప అధ్యక్షుడు డా.మడికొండ శ్రీను, చందుపట్ల రాఘవరెడ్డి, పసుల రమేష్, దార్న వేణుగోపాల్,మెరుగు శ్రీశేలం తదితరులు పాల్గొన్నారు.

## కంఠాత్మకూర్ బ్రిడ్జి వద్ద వాహనాల దారి మళ్లింపు

**పర్యవేక్షిస్తున్న దామెర ఎస్ఐ కొంక అశోక్**



అక్షర దర్బార్, పరకాల: కంఠాత్మకూర్ గ్రామంలోని బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరగడంతో ప్రజలు అటు వైపు వెళ్లకుండా వాగు ప్రవహిస్తున్న స్థలంలో అటువైపు వెళ్ళకూడదు చేపలు పట్టటం వాగు లోకి దిగి వీడియో లు సెల్ఫీ ల కోసం అటువైపు వెళ్ళకూడదని దామెర ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. పరకాల నుండి హన్మకొండకు వెళ్లే ప్రయాణికులు కంటాత్మకూర్ నుండి వయా సిద్దాపూర్– వంగపహడ్ వైపు మీదుగా వాహనాల మళ్లింపు గ్రామంలో కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపేశారు.

## 'మొంథా'తో తీరని నష్టం



అక్షర దర్బార్, మంగపేట: మొంథా తుపాన్ ప్రభావంతో అన్నదాతలు ఆగమాగం అయ్యారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సన్నకారు రైతులు చదికలబడ్డారు కష్టపడి పండించిన వరి పత్తి మిర్చి పంటలు భయంకరమైన ఈదురు గాలివానతో కూడిన వర్షాలకు చేతికొచ్చిన పంటలు నేలకొరవడంతో రైతన్నలకు తీవ్ర నష్టం నెలకొంది ఈ ఏడాది అంత వాతావరణం పెనుమార్పులకు రాణి పోని వర్షాలకు వరి పత్తి మిర్చి పంటలు వేసిన రైతులు తీవ్ర ఇబ్బంది పడుతుంటే మూలిగే నక్క మీద తాటి పండు పడ్డ సామెతలా మొంథా తుపాన్ వచ్చి రైతన్నలను మరింత ముంచింది పంట నష్టపోయిన రైతన్నలకు ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని రైతు సంఘాల నాయకులు వేడుకున్నారు.



# అకాలం.. ఆగమాగం

- అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ
- చెల్పూరు చెరువుకు గండి
- నీట మునిగిన వరి పంట



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : ఈ వానాకాలం పంటల సాగు మొదలైనప్పటి నుంచి అన్నదాతలపై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. తొలుత అనావృష్టి, తర్వాత అతివృష్టి, ఇప్పుడు మొంథా తుఫాన్ రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీటి పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటుచేయగా.. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులు తడిసిపోవటం, తేమ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం మండల వ్యాప్తంగా ఎక్కువగా ఉండటం ఆందోళనకరంగా మారింది. వానాకాలం సీజన్ ప్రారంభ దశలో లోటు వర్షపాతం నమోదైంది. రైతులు విత్తనాలు వేయటానికి కూడా వెనకా ముం దూ ఆలోచించారు. జూలైలోనూ అంతంతమాత్రంగానే వర్షాలు పడ్డాయి. ఈ రెండు నెలలు కూడా రైతులు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు వచ్చేసరికి నైరుతి రుతుపవనాలు విజృంభించాయి. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత అక్టోబరులో అధికంగా వర్షపాతం నమోదైంది.

### తొలుత వర్షాభావం.. తర్వాత అతివృష్టి

వానాకాలం మొదలై 5 నెలలు అయ్యింది. జూన్, జూలై నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో వానలు దంచికొడుతున్నాయి. ఆవర్తన ద్రోణులు, అల్పపీడనాల ప్రభావంతో రెండు నెలలు కుండపోత వర్షాలు కురిశాయి. ఇప్పుడేమో మొంథా తుఫాన్ తోడైంది. రైతులకు, పంటలకు వానలు అవసరంలేని పరిస్థితుల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా అవసరానికి మించి వర్షపాతం నమోదుకావటం గమనార్హం. భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల పరిధిలో చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయి. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం చెల్పూరు చెరువుకు గండిపడటంతో వాగు ఎక్కువై పాతర్ల పెల్లి మెట్టుపల్లి మొట్లపల్లి వేములపల్లి బంగ్లాపల్లి మొగుళ్లపల్లి కొరికిశాల వాగు ప్రవహిస్తున్న సమీప గ్రామాలలోని వరిపంట వందలాది ఎకరాల విస్తీర్ణంలో నీటమునిగి రైతులకు దుఃఖం మిగిల్చింది దీంతో రైతులకు ఏంచేయాలో తోచటంలేదు. వాగు ఉధృతికి మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన చిలుకూరి రాజిరెడ్డి ఆళ్ల కరుణాకర్ రెడ్డి మహ్మద్ గఫూర్ శ్రీ పెళ్లి కోటి మెరుగు రాజయ్య లకు సంబంధించిన వరి పొలాలు నీటిపాలయ్యాయి వందలాది ఎకరాలలో చేతికొచ్చిన పొలం చేజారి పోవడంతో రైతులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు

### పంట నష్టంపై ప్రాథమిక నివేదిక

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించాలని, ప్రాథమిక నివేదిక తయారుచేసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని, పంట నష్టం అంచనా వేయాలని రైతులు ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు వరద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పంటల పరిస్థితి ఏమిటి? తేలిన తర్వాత కోలుకుంటాయా? లేకపోతే పూర్తిగా నష్టపోయినట్లేనా? పంట నష్టం ఎంత శాతం జరిగింది? అనే అంశాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేయాలని వ్యవసాయ శాఖ అధికారులుకు పలువురు బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు,

### ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో
## తహసీల్దార్ కు సన్మానం



అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : వెంకటాపురం తహసీల్దార్ మేడ వేణుగోపాల్ ను ఎమ్మార్పీఎస్ నేతలు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నూతనంగా ఎన్నిక కాగా, అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల మల్లేష్ మాదిగ, కోగిల మల్లికార్జున మాదిగ, గుగ్గిళ్ళ కళ్యాణ్ మాదిగ పాల్గొన్నారు.

## ఆటపాటలతోనే అంగన్వాడీ విద్య

**ఇన్చార్జి డీడబ్ల్యూఓ మల్లేశ్వరి**



అక్షరదర్బార్, చిట్యాల: చిట్యాల మండలం ఒడితల గ్రామంలోని లక్ష్మీ టీచర్ అంగన్వాడీ సెంటర్‌లో నైన్ పాక్ సెక్టార్ సమావేశం ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద సమక్షంలో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి డీడబ్ల్యూఓ మల్లేశ్వరి హాజరై మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట, పాట, కథల ద్వారా విద్యను పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రీ–స్కూల్ కార్యక్రమాలను ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. పిల్లలు, తల్లులకు మెనూ ప్రకారం రుచిగా భోజనం అందించాలని సూచించారు. కొత్త లబ్దిదారుల వివరాలను వెంటనే నమోదు చేసి, ఫేస్ క్యాప్చర్ అనంతరం మాత్రమే ఆహారం ఇవ్వా లని సూచించారు. కార్యక్రమంలో ఉమా దేవి, సుజాతతో పాటు 25 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

**: భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**



అక్షరదర్బార్, భూపాలపల్లి : జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పాఠశాలల్లో విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలు, హాజరు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ విద్య, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాల్లో నాణ్యత పెంపు అవసరమని పేర్కొన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను క్రమం తప్పక తనిఖీ చేసి నివేదికలు పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కంప్యూటర్లు పనిచేయని పాఠశాలల్లో వెంటనే మరమ్మతులు చేసి విద్యార్థుల ఉపయోగంలోకి తేవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల నిర్వహణ ఖర్చులపై ధృవీకరణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఈడబ్ల్యూఐడిసి ఏఈ జీవన్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బతికుండగానే
# మార్చురీకి తరలింపు

- ఆధార్ కార్డులేదని రోగికి చికిత్స నిరాకరణ
- అచేతనంతో పడి ఉండటంతో మార్చురీకి రిఫర్
- పారిశుధ్య సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం
- మానుకోట ప్రభుత్వ దవాఖాన సిబ్బంది నిర్వాకం

అక్షరదర్బార్, మహబూబాబాద్: అనారోగ్యంతో చికిత్స కోసం హాస్పిటల్‌కు వచ్చిన వ్యక్తిని, ఆధార్ కార్డు లేదనే నెపంతో సిబ్బంది ఆసుపత్రిలో చేర్చుకోలేదు. అతడి ఆరోగ్య పరిస్థితి ఏంటని, ఆ సిబ్బంది కనీసం కనికరించి చికిత్స చేయడానికి కూడా ముందుకు రాలేదు. చివరకు అతడు బతికి ఉండగానే మార్చురీకి తరలించారు. ఈ అమానవీయ ఘటన గురువారం మహబూబాబాద్ గవర్నమెంట్ ఆస్పత్రిలో వెలుగు చూసింది. ఇటీవల ఓ వ్యక్తి తీవ్రమైన అనారోగ్యంతో మానుకోట ప్రభుత్వ దవాఖానకు వచ్చాడు. రెండు రోజులు పడిగాపులుకాసినా వైద్యులు, వైద్యసిబ్బంది అతడిని పట్టించుకోలేదు. అతడు ఏ మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉండటంతో మార్చురీకి తరలించారు. ఉదయం మార్చురీ గదిని శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్లు రోగి కదలికలను గుర్తించి పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. దీంతో వైద్యులు అతడికి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి స్వగ్రామం చిన్నగూడూరు మండలం జయ్యారమని, పేరు రవి అని తెలిసింది. మరోవైపు ఆధార్ కార్డు లేకుండా ఆసుపత్రిలో వైద్యులు, వైద్యసిబ్బంది చికిత్స అందించకపోవడంపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.





# వాన వెలిసింది..
# వ్యథ మిగిలింది!

- ఉమ్మడి జిల్లాను వణికించిన 'మొంథా' తుఫాన్
- ట్రైసిటీస్ అతలాకుతలం.. స్తంభించిన జనజీవనం
- కాలనీల్లో ఇప్పటికీ వరదనీరు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- వేలాది ఎకరాల్లో పంట నష్టం
- రేపు సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేట లోని కొన్ని ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వరంగల్– హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ ఇంకా వర్షపు నీటితోనే నిండిపోయి ఉన్నది. భద్రకాళి రోడ్డు వద్ద ఉన్న సరస్వతీ కాలనీ, వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డు నీట మునిగిపోయాయి. పట్టణంలోని సుమారు 40కి పైగా కాలనీలు వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. సాయిగణేశ్ కాలనీ, సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్యనగర్, సమ్మయ్య నగర్‌లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది.

**- హనుమకొండలో**

హనుమకొండలోని 49వ డివిజన్ నాగేంద్రనగర్, బాంబే కాలనీల్లోని పలు ప్రాంతాల్లో సుమారు 90 ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలంకార్ బ్రిడ్జి, కాపువాడ, కాకతీయకా లని ఫేజ్ –1, ఫేజ్ –2, కేయూ బైపాస్ రోడ్ పెద్ద మ్మగడ్డ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు రాకపోక లను నిలిపివేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. హనుమకొండ చౌరస్తా మీదుగా వరంగల్‌కు అంతరాయం ఏర్పడింది. అలంకార్ జంక్షన్, ములుగురోడ్ మీదుగా హనుమ కొండ – వరంగల్ మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో నిద్రాహారాలు మాని ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వేయిస్తంభాల దేవాలయ ప్రధాన రహదారి, హనుమకొండ చౌరస్తా, బస్‌స్టేషన్ రోడ్డు, పెద్దమ్మగడ్డ వరద ఉధృతికి రోడ్లు దెబ్బతిన్నాయి. ధర్మసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో అధికారులు 9 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరగడంతో దేవునూర్ వాగులోకి ప్రవాహిస్తోంది. ధర్మసాగర్ నుంచి దేవునూరు, సోమదేవరపల్లి రాపాకపల్లి మీదుగా హసన్‌పర్తి, ఎల్కతుర్తి మండలాల వైపు ప్రవాహి స్తోంది. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటమునిగాయి.

**- వరద బాధితుల ఆందోళన**

వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ , నగర మేయర్ సుధారాణి వాహనాలను సమ్మయ్య నగర్ వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోపాల్పూర్ ప్రాంతంలోని అమరావతి నగర్, జవహర్ నగర్, పరిమళకాలనీ, ద్వారకా నగర్ తదితర కాలనీలు నీట మునిగాయి.

**- యువతీ, యువకుడి గల్లంతు.. యువకుడు సేఫ్**

జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బైక్‌పై వెళ్తున్న యువతీ, యువకుడు తిమ్మంపేట గొల్ల మత్తడిలో గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన బరిగల శివకుమార్, వరంగల్ జిల్లా వర్ధన్న పేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన యువతి శ్రావ్య బైక్ పై వస్తున్నారు. తిమ్మంపేట గొల్ల మత్తడి వద్ద వరదను లెక్క చేయకుండా దాటే ప్రయత్నం చేయగా బైక్‌తో సహా ఇద్దరు కొట్టుకుపో యారు. శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకొని సుర క్షితంగా బయటపడ్డాడు. యువతి మాత్రం గల్లంత య్యింది. సమాచారం అందుకున్న పోలీసులు గొల్ల ముత్తడి వద్దకు చేరుకుని 30 మంది ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తున్నారు.

**- రేపు సీఎం ఏరియల్ సర్వే**

వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహిస్తారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం వరంగల్ పర్యట నను వాయిదా పడింది.



# నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, చిట్యాల : మండలంలోని ఓడితల గ్రామానికి చెందిన విడి దినేని విజయ–శంకరయ్య కుమారుడి వివాహానికి, నైన్ పాక గ్రామానికి చెందిన మ్యాకల పద్మ–కొండల్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకలకు భూపా లపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి హాజరై నూతన వధూవరు లను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

# స్కాలర్ షిప్ లు వెంటనే విడుదల చేయాలి

**- చిట్యాలలో ఏబీవీపీ వినూత్న నిరసన**



అక్షరదర్బార్, చిట్యాల: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాలలో ఏబీవీపీ విద్యార్థులు వినూత్న నిరసన తెలిపారు. విద్యార్థులు టీ అమ్ముతూ, కూరగాయల జీప్ నడుపుతూ, మెకానిక్ పనులు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ, స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, యాజమా న్యాల ఒత్తిడితో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబి స్తోందని విమర్శించారు. వెంటనే రూ.8,300 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్య దర్శి అజయ్, కృష్ణ, శశి వర్ధన్, అనూప్, జశ్వంత్, రజనీకాంత్ పాల్గొన్నారు.

# కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతం

- భూపాలపల్లి ఆర్డీవో ఎన్ రవి
- గణపేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అక్షరదర్బార్, గణపురం: కాకతీయులు నిర్మించిన కోట గుళ్లు శిల్ప సంపద ఎంతో అద్భుతమని భూపాలపల్లి ఆర్డీవో ఎన్ రవి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని కోటగుళ్ల ఆలయం రామప్పను పోలిన విధంగా ఉందన్నారు. మరోసారి ఆలయాన్ని సందర్శిస్తానని ఈ సందర్భంగా అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆయన వెంట గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారా యణ స్వామి తదితరులు ఉన్నారు.



# అందుబాటులో ఉంటూ ఆదుకోవాలి

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు
- తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి
- మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మొంథా తుఫాన్ సహాయక చర్యలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



అక్షరదర్బార్, వరంగల్: మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై గురువారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ కృష్ణారావు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరెట్ నుండి రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, ఎన్డీఆర్ఎఫ్ టీ, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ వీసీలో సీఎం మాట్లాడుతూ శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తామని అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల జిల్లా ఇంచార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి అందుబాటులో ఉండాలన్నారు. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఇది వరి కోతల కాలం, అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలన్నారు



# హైడ్రా తరహాలో వైడ్రా!

- ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- సీఎం రేపటి ఏరియల్ సర్వే తర్వాత ప్రకటించే అవకాశం
- ఒకవేళ ప్రకటన వస్తే ట్రైసిటీ వాసులకు మంచిరోజులు
- వరద ముప్పు నుంచి విముక్తి.. చెరువులు, నాళాల కబ్జాకు చెక్
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ



అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి రక్షణ సంస్థ (హైడ్రా) తరహాలో వరంగల్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి రక్షణ సంస్థ (వైడ్రా) ఏర్పాటు చేసే యోజనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయమైన సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టనున్న ఏరియల్ సర్వే తర్వాత అధికారిక ప్రకటన చేస్తారని సమాచారం. లేదంటే పర్యటన ముగిసిన తర్వాత మంత్రులతో భేటీ ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. ఐదేండ్లలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను అడపాదడపా వరదలు నగరవాసులను కలవరపరుస్తున్నాయి. 2021లో వరదలు ట్రైసిటీల పరిధిలో అతి పెద్ద విపత్తు. నాడు వరంగల్, హనుమకొండ సిటీల పరిధిలో వందకు పైగా కాలనీలు జలమయమయ్యాయి. రాష్ట్రప్రభుత్వం ఒకవేళ వైడ్రా ఏర్పాటు చేస్తే వరంగల్ మన్సిపల్ కార్పొరేషన్ వాసులకు ఇక బెంగ అక్కర్లేదు. వైడ్రా విభాగం వర్షాకాలంతో పాటు విపత్తుల సమయంలో ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతుంది.

### - వరద ముప్పు నుంచి విముక్తి

వరంగల్‌తో పాటు హనుమకొండ, కాజీపేట శివారు ప్రాంతాలకు ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ వస్తుంది. వరదలు, విపత్తుల సమయంలో వైడ్రా విభాగం వెంటనే అప్రమత్తమై జాతీయ విపత్తు స్పందన బృందాలు, వాతావరణ శాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ వంటి సంస్థలతో సమన్వయం చేసుకుంటుంది. వాతావరణ సమాచారాన్ని ముందుగానే విశ్లేషించి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంది. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా, డ్రైనేజీ అడ్డంకులు లేకుండా పర్యవేక్షిస్తుంది.

### - ప్రభుత్వ ఆస్తుల రక్షణ..

అలాగే వైడ్రా విభాగం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. చెరువులు, నాళాలు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, లేఅవుట్లలోని ఖాళీ స్థలాలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా అడ్డుకుంటుంది. ఆస్తుల ఆక్రమణలపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, విచారణ చేపడుతంది. ఒకవేళ ఆక్రమణలపు గుర్తిస్తే వాటిని తొలగించడానికి కలెక్టర్లు, కమిషనర్లు, పోలీసుల సహకారంతో వాటిని కూల్చివేస్తుంది. లేదా తొలగిస్తుంది.

### - నిబంధనల ఉల్లంఘనపై నియంత్రణ

వన నిర్మాణ అనుమతుల నిబంధనల ఉల్లంఘనలు, శిథిల భవనాలు, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితులను పరిశీలించి, అక్రమ నిర్మాణాలపై న్యాయపరమైన చర్యలు తీసుకునే అధికారం హైడ్రాకు ఉంటుంది. అనధికార హోర్డింగులు, ఫ్లెక్సీల తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యతలనూ వైడ్రా నిర్వర్తిస్తుంది.



# వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

### - తక్షణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు

అక్షరదర్బార్, హనుమకొండ: భారీ వర్షం కారణంగా వరద ఉధృతి పెరగడంతో నగరంలోని పలు కాలనీలు జలమయం కాగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీల పరిస్థితులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న కాలనీల్లో తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డీఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాలపూర్ ఊర చెరువుతో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతినగర్, 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్యనగర్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న వరదలో చిక్కుకున్న బాధిత కుటుంబాన్ని డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి తరలించారు. సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా హసన్ పర్తిలోని డిగ్రీ కళాశాలకు, సుబ్బయ్యపల్లిలోని కళాశాలకు, మడికొండలోని బాలికల కళాశాలకు తరలించారు. హనుమకొండ అలంకార్ జంక్షన్ తో పాటు కాపువాడలో వరద ముంపునకు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావుసింగ్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ముహూర్తం ఖరారు

- రేపు రాజ్ భవన్‌లో అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం



అక్షరదర్బార్, హైదరాబాద్: కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ ఈ ప్రభుత్వంలో గ్రేటర్ పరిధిలో తొలి మంత్రి కాబోతున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాజ్‌భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. మరోవైపు.. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం గవర్నర్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఇది.. ఊహించని విపత్తు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండలో వరద ప్రభావిత ప్రాంతాల్లో గురువారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పర్యటించారు. ఉదయం నుంచి గోకుల్ నగర్, గాంధీ నగర్, సమ్మయ్య నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇది ఊహించని విపత్తుగా నాయిని పేర్కొన్నారు. నిరాశ్రయులుగా ఉన్న వారికి తమ టీమ్స్ నేరుగా వెళ్లి భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. ఊహకందని రీతిలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో వర్షం రావడం, లోతట్టు ప్రాంతంలో ఉన్న మన నగరానికి జనగామ, స్టేషన్ ఘనపూర్ ల నీరు రావడం మరింత ఆందోళన కలిగిస్తుందని రాజేందర్ రెడ్డి తెలిపారు. గడిచిన 24 గంటల నుంచి జిల్లా అధికార యంత్రాంగ కృషి చేస్తున్నది. యువతి, యువకులు ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో జరుగుతున్న పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా ఈ మహా విపత్తులో నిరాశ్రయులైన వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.




# 2కే రన్ ను విజయవంతం చేయండి

### మొగుళ్ళపల్లి ఎస్సై బి.అశోక్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 2కే రన్ ను విజయవంతం చేయాలని మొగుళ్ళపల్లి ఎస్సె బొరగాల అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఆరున్నర గంటలకు ఎంజీపీ స్కూల్ నుండి ప్రారంభమయ్యే కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండలంలోని యువత అధిక సంఖ్యలో పాల్గొని దేశ ఐక్యతను మరింత బలపరచాలని ఎస్సై యువతకు పిలుపునిచ్చారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915